సాక్షి నిజామాబాద్

గురువారం । 13 । జూన్ । 2024



జల్సాల కోసం చైన్ స్నాచింగ్

జల్సాలకు అలవాటు పడి, ఒంటరి మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

- 8లో ▶



ప్రభుత్వ పాఠశాలల్లో..

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని అదనపు కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు.

- 8లో ▶

గరిష్టం/కనిష్టం

39.9 /22.7

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం అవుతుంది. ఈదురు గాలులు వీస్తాయి. అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు గురువారం తెలంగాణ యూనివర్సిటీలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తున్నట్లు దోస్త్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెయూ అకడమిక్ ఆడిట్ సెల్ విభాగంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. పీహెచ్‌సీ(దివ్యాంగులు)/ సీఏపీ/ ఎన్‌సీసీ/ఎక్స్‌ట్రా కరిక్యులమ్ ఆక్టివిటీస్ విద్యార్థులకు మాత్రమే ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని వివరించారు.

నేటి నుంచి వరంగల్‌కు డీలక్స్ బస్సులు


ఖలీల్‌వాడి : నిజామాబాద్ నుంచి వరంగల్ మార్గంలో పెరిగిన రద్దీకి అనుగుణంగా ఉదయం, సాయంత్రం 'డీలక్స్' బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆర్‌ఎం జానీరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ నుంచి వరంగల్‌కు బస్సులు నడవడంతో ప్రయాణికులు ఉపయోగించుకోవాలని కోరారు.

జిల్లాలో పలుచోట్ల వర్షం

- విస్తరించిన నైరుతి రుతుపవనాలు

సుభాష్‌నగర్ : నైరుతి రుతుపవనాలు ప్రభావంతో బుధవారం జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. సగటున 8.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నందిపేట్‌లో 42.7 మిల్లీమీటర్లు, బోధన్‌లో 28.8, సాలూరలో 26.8, సిరికొండలో 25.2, నవీపేట్‌లో 21.8, డొంకేశ్వర్‌లో 20.5, నిజామాబాద్ రూరల్‌లో 18.3, ఎడపల్లిలో 16.9, ధర్పల్లిలో 11.0, రెంజల్‌లో 10.7, వేల్పూర్, మాక్లూర్‌లో 9.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఏడు మండలాల్లో అధిక, 12 మండలాల్లో సాధారణ, 9 మండలాల్లో లోటు, మరో 5 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. రానున్న రెండ్రోజులు జిల్లాలో మోస్తరు వర్షం కురిసే అవకాశముందన్నారు. కాగా జిల్లాను తొలకరి వర్షాలు పలకరించడంతో రైతులు వ్యవసాయ పనులు చేపట్టేందుకు సిద్ధం అవుతున్నారు.

వాటర్ ట్యాంకుపై పిడుగు



మాక్లూర్ : మండలంలోని బోర్గాం(కె)లో మంగళవారం రాత్రి పిడుగు పడింది. గ్రామానికి చెందిన గంగాధర్ ఇంటిపై ఉన్న నీటి ట్యాంకుపై పిడుగు పడింది. దీంతో ట్యాంక్ ధ్వంసమైంది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

లక్కంపల్లిలో చెట్టుపై..



నందిపేట్ : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని లక్కంపల్లిలో వేప చెట్టుపై పిడుగు పడింది. దీంతో ఆ చెట్టు విద్యుత్ వైర్ల మీద పడి నేలకొరిగింది. అప్పటికే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది.

స్థానికంపై

కన్నేసిన కమలం

- గ్రామగ్రామాన పాగా వేసేందుకు ఎంపీ కసరత్తు
- ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేసుకుంటున్న అర్వింద్
- క్షేత్రస్థాయిలో సర్వేలు.. నివేదికలు తెప్పించుకుని విశ్లేషణ
- బలం తక్కువగా ఉన్న చోట్ల చేరికలకు ఏర్పాట్లు
- తరువాత మున్సిపాలిటీల్లోనూ పాగాకు ప్రయత్నాలు

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతోనే కమలం పార్టీ నేతలు రానున్న గ్రామ పంచాయతీ, మండల, జిల్లా ప్రజాపరిషత్ ఎన్నికల్లో గణనీయమైన స్థానాలు గెలుచుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ మేరకు పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు తెప్పించుకుని విశ్లేషణ చేస్తున్నారు. తమకు బలం తక్కువగా ఉన్న చోట్ల చేరికలకు రంగం సిద్ధం చేస్తున్నారు.



- దక్షిణాదిలో పాగా వేయాలనుకుంటున్న బీజేపీకి వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి వరుసలో ఉంది. బీఆర్‌ఎస్‌ను వెనక్కు నెట్టి ప్రాబల్యాన్ని విస్తరించుకునేందుకు కమలనాథులు వ్యూహాలు రచిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ, మండల, జిల్లా ప్రజాపరిషత్ ఎన్నికల్లో సైతం గణనీయమైన స్థానాలు గెలుచుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో స్థానిక సంస్థల్లో పాగా వేసే లక్ష్యంతో కమలం పార్టీ కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగా పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ ఇప్పటికే సర్వేలు చేయించే ప్రక్రియను మొదలు పెట్టారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో బూత్‌ల వారీగా గ్రామాల్లో సాధించి న ఓట్లకు సంబంధించి విశ్లేషణ చే స్తుండడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితులపై వరుస నివేదికలు తె ప్పించుకుంటున్నారు. అందుకు అ నుగుణంగా విశ్లేషణలు చేస్తూ ముందుకు వెళ్లేందుకు ప్రణాళికలు త యారు చేస్తున్నారు. కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీజేపీ రాష్ట్రంలోనూ 8 ఎంపీ స్థానాలతో సంచలనం సృష్టించింది. నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో సైతం వరుసగా రెండోసారి అర్వింద్ గెలుపొందారు. ఈసారి లక్షకు పైగా ఓట్ల ఆధిక్యం సాధించారు. మరోవైపు ఆరు నెలల కిందట జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ బీజేపీ 8 మంది ఎమ్మెల్యేలను గెలుచుకుంది. ఇందులో నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ నుంచి పైడి రాకేశ్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ మంచి మెజారిటీలతో విజయం సాధించారు.

- జిల్లాలో బీజేపీ ఇప్పటివరకు పట్టణ ప్రాంతాల్లో సత్తా చాటింది. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు గతంలో జరిగిన ఎన్నికల్లో 28 మంది కార్పొరేటర్లను కమలం పార్టీ గెలిపించుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది. 13 సీట్లు గెలిచిన బీఆర్‌ఎస్, 16 సీట్లు గెలిచిన ఎంఐఎం కలిసినప్పటికీ బలం సరిపోకపోవడంతో ఎక్స్ అఫీషియో ఓట్ల ద్వారా గట్టెక్కారు. బీఆర్‌ఎస్‌కు మేయర్, ఎంఐఎంకు డిప్యూటీ మేయర్ వచ్చాయి. మరోవైపు ఆర్మూర్ మున్సిపాలిటీలో బీజేపీ ఐదుగురు కౌన్సిలర్లను, బోధన్ మున్సిపాలిటీలో ఒక కౌన్సిలర్ స్థానాన్ని గెలుచుకుంది. ఇదిలా ఉండగా జిల్లాలో మొత్తం 35 ఎంపీటీసీ స్థానాలను, 2 జెడ్పీటీసీ (రెంజల్, నందిపేట), 1 ఎంపీపీ (రెంజల్) లను బీజేపీ గెలుచుకుంది. ఈసారి ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు సైతం బీజేపీ వాళ్లే ఉండడంతో పాటు బోధన్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లోనూ క్షేత్రస్థాయిలో బలం పెరిగినట్లు పార్టీ భావిస్తోంది. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్లలో బీజేపీ భారీ ఆధిక్యం సాధించింది.
- పార్లమెంట్ ఎన్నికల్లో సాధించిన ఓట్లకు సంబంధించి కమలం పార్టీ నేతలు అన్ని గ్రామాల్లో బూత్‌ల వారీగా వచ్చిన ఓట్ల లెక్కలు వేసుకుంటున్నారు. మొదటి స్థానం, రెండో స్థానం, మూడో స్థానం సాధించిన బూత్‌లను కేటగిరీలుగా విభజించి పార్టీ బలాబలాలను అంచనా వేసుకుంటున్నారు. ఈ మేరకు తాజా క్షేత్రస్థాయి పరిస్థితులపై విశ్లేషణలు చేసుకుంటున్నారు.

జిల్లాలోని 530 గ్రామ పంచాయతీలు, 299 ఎంపీటీసీలు, 31 జెడ్పీటీసీలు (ప్రస్తుతం 27 ఉన్నాయి. కొత్తగా ఆలూరు, డొంకేశ్వర్, సాలూర, పోతంగల్) లపై దృష్టి పెట్టారు. ఈ స్థానాల్లో ఎక్కడ బలంగా ఉన్నాము.. ఎక్కడ బలం తక్కువగా ఉందన్న విషయాలపై విశ్లేషణలు చేసుకుంటున్నారు. బలం తక్కువగా ఉన్న చోట్ల చేరికలకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందులో యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇచ్చేందుకు నిర్ణయించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా జిల్లాలో మెజారిటీ స్థానాలు సాధించే లక్ష్యంతో ఎంపీ అర్వింద్ ప్రణాళికలు రచిస్తున్నారు.

విద్యారంగ అభివృద్ధే ధ్యేయం



రాకాసీపేట్ ఉన్నత పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

- ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి

బోధన్ : విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంతో పాటు మౌలిక వసతులు మెరుగు పర్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం బోధన్‌లోని రాకాసీపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ)లో విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, డీఈవో దుర్గాప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు.

నాణ్యమైన విద్య అందించేందుకు కృషి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. జిల్లాలోని 792 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో తాగునీరు, మూత్రశాలలు తదితర పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. తొలిరోజు జిల్లాలో 1.20 లక్షల మంది విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాభివృద్ధికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, ఎంఈవో నాగ్‌నాథ్, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, పాఠశాల హెచ్‌ఎం బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

వ్యాధుల నియంత్రణకు చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

- డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

నిజామాబాద్‌నాగారం : దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ సూచించారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. దోమల నియంత్రణపై ఇంటింటికి వెళ్లి ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి దోమలతో వ్యాపించే మలేరియా, డెంగీ, చికూన్ గున్యా, ఫైలేరియా తదితర వ్యాధుల గురించి వివరించాలని సూచించారు. ఎక్కడైనా డెంగీ కేసులు నమోదైతే ఆ ఇంటి పరిసరాల్లో దోమల నివారణ మందులు పిచికారి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు పాల్గొనేలా చూడాలన్నారు. జిల్లాను డెంగీ రహితంగా మార్చడానికి కృషి చేయాలన్నారు.

అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలి

మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో డీఎంహెచ్‌వో జూమ్ మీటింగ్ నిర్వహించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినంపై డీఎంహెచ్‌వో, డీఐవో అశోక్ శిక్షణనిచ్చారు. 19 ఏళ్లలోపు వారికి జూన్ 20న అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా ఘన్పూర్ వెంకటేశ్వర్లు వ్యవహరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రమేశ్, అంజన, విద్య, ప్రోగ్రాం ఆఫీసర్లు లావణ్య, నాగరాజు, అశోక్, రాజు, వినీత్, ఏవో చందర్, డిస్ట్రిక్ మేనేజర్ సచిన్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే స్విమ్మింగ్ పూల్

- నడిచేవి అసాంఘిక కార్యకలాపాలు
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- 10 రోజుల వ్యవధిలో వెలుగులోకి రెండు ఘటనలు



కల్లెడి, ఆలూర్ మధ్యలో ఉన్న స్విమ్మింగ్ పూల్



సీసీ కెమెరాలో నమోదైన ఘర్షణ దృశ్యం

మాక్లూర్ : అది పేరుకే స్విమ్మింగ్ పూల్. కానీ అక్కడ నడిచేవన్ని అసాంఘిక కార్యకలాపాలు. మండలంలోని కల్లెడి, ఆలూర్ గ్రామాల మధ్య స్విమ్మింగ్ పూల్ ఉంది. మొదట్లో పాఠశాల స్థాయి విద్యార్థులకు మాత్రమే గంటకు రూ.10 తీసుకుని స్విమ్మింగ్ చేయటానికి అనుమతించేవారు. తర్వాత చిన్నా పెద్ద తేడా లేకుండా రూ.200 రుసుం తీసుకొని అందరికి ప్రవేశం కల్పించడం ప్రారంభించారు. ఇక్కడకు మద్యం తెచ్చుకొని తాగినా అడిగేవారు లేకపోవడంతో పూల్‌కు వచ్చే యువకుల సంఖ్య పెరిగింది. పూల్ వద్ద మద్యం తాగడానికి అనుమతించడం సరికాదని కొందరు స్థానికులు వ్యతిరేకించారు. అయినా నిర్వాహకులు పట్టించుకోలేదు. అంతేకాకుండా ఏడాది క్రితం నుంచి రోజుకు రూ.ఐదు వేల నుంచి రూ.పది వేల వరకు తీసుకొని రాత్రి పూట బర్త్‌డే పార్టీలు, గెట్ టూ గెదర్ పార్టీలకు పూల్‌ను అద్దెకు ఇవ్వడం ప్రారంభించారు. దీని అదునుగా తీసుకొని కొందరు అద్దెకు తీసుకొని అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

సీజ్ చేసినా..

ఈత కొలనులో మే 30న రాత్రి జరిగిన బర్త్ డే పార్టీలో అక్కడికి వచ్చిన ఓ వ్యక్తి మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయమై భారీ ఘర్షణ జరిగింది. అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తితో పాటు పూల్ నిర్వాహకుడిపై బాధితులు సీపీ కల్మేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సీపీ ఆదేశాల మేరకు మాక్లూర్ పోలీసులు స్విమ్మింగ్‌పూల్‌ను మూయించారు. అయినా నిర్వాహకులు మళ్లీ తెరిచారు. ఈ క్రమంలో ఈ నెల 9న ఆర్మూర్ ప్రాంతానికి చెందిన కొందరు బర్త్‌డే పార్టీకి పూల్‌ను బుక్ చేసుకున్నారు. రాత్రి పార్టీలో రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణ పడ్డారు. ఒకరిని చితకబాది, స్విమ్మింగ్ పూల్ ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఈ వ్యవహారమంత గుట్టుగా ముగించేశారు. తాజాగా ఈ ఘటన వెలుగులోనికి రావటంతో మాక్లూర్ ఎస్సై సుధీర్‌రావు తమకు తెలియకుండా పూల్‌ను ఎందుకు ప్రారంభించారని నిర్వాహకుడిని బైండోవర్ చేశారు.

మద్యం తాగుతున్నారు

కల్లెడి శివారులో ఉన్న స్విమ్మింగ్‌లో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి. అక్కడ మద్యం తాగుతున్నారు. ఆ మత్తులో పార్టీకి వచ్చిన మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. మే 30న జరిగిన ఘటనపై సీపీకి ఫిర్యాదు చేశాం. స్విమ్మింగ్‌పూల్ వద్ద మద్యం అనుమతించొద్దు.

– నవాతే ప్రతాప్, బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

బైండోవర్ చేశాం

మూయించిన స్విమ్మింగ్‌పూల్‌ను మాకు తెలియకుండా ప్రారంభించడంతో నిర్వాహకుడిని బైండోవర్ చేశాం. అవసరమైతే అతనిపై కేసు నమోదు చేస్తాం. ఈ నెల 9న రాత్రి స్విమ్మింగ్‌పూల్‌లో జరిగిన ఘర్షణ విషయం నాకు బుధవారం తెలిసింది. ప్రస్తుతం స్విమ్మింగ్ పూల్‌ను మళ్లీ మూయించా. అక్కడ ఏం జరిగిందనేది విచారిస్తున్నాం.

– సుధీర్‌రావు, ఎస్సై, మాక్లూర్

మోగిన బడిగంట



నగరంలోని బోర్గాం(పి) పాఠశాలలో విద్యార్థుల సందడి

క్లాసులో కూర్చున్న విద్యార్థులు

బోర్గాం(పి) స్కూల్‌లో గంట కొడుతున్న అటెండర్

సైకిల్‌పై పాఠశాలకు వస్తున్న విద్యార్థి



వేసవి సెలవులు ముగిసి బుధవారం పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు బడిబాట పట్టారు. సుదీర్ఘ సెలవుల తర్వాత పాఠశాలకు రావడంతో స్నేహితులతో సందడిగా గడిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

క్లుప్తంగా

ఉగ్రమూకల దిష్టిబొమ్మ దహనం



సుభాష్‌నగర్‌: జమ్మూ కాశ్మీర్‌లోని వైష్ణోదేవి దర్శనానికి వెళ్లిన భక్తుల బస్సుపై దాడి చేసి వారి మృతికి కారకులైన ఉగ్రవాద మూకల దిష్టిబొమ్మను బజరంగ్‌దళ్‌, విశ్వహిందూపరిషత్‌ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఎన్టీఆర్‌ చౌరస్తాలో దహనం చేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ ఠాకూర్‌, నాయకులు ధాత్రిక రమేశ్‌, రాంప్రసాద్‌ చటర్జీ, అఖిల్‌, పాతూరి మహేశ్‌, నికేశ్‌, గాదె సతీశ్‌, నరేశ్‌గౌడ్‌, సాయి, అఖిల్‌, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌ సైన్స్‌ విద్యార్థికి గోల్డ్‌ మెడల్‌



రుద్రూర్‌: మండల కేంద్రంలోని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల విద్యార్థి శ్రీహర్ష గోల్డ్‌ మెడల్‌ సాధించినట్లు కళాశాల అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ కల్పన తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్‌ జయశంకర్‌ అగ్రికల్చర్‌ యూనివర్సిటీలో కాన్వకేషన్‌ సందర్భంగా గోల్డ్‌ మెడల్‌ బహుకరించారని, తమ కళాశాల విద్యార్థినికి గోల్డ్‌ మెడల్‌ రావడంపై అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్‌: మాక్లూర్‌లోని గిరిజన సంక్షేమ మినీ గురుకులంలో ఒకటో తరగతిలో కొత్త అడ్మిషన్లు, రెండో తరగతిలో మిగిలి ఉన్న ఒకటి, ఐదో తరగతిలో ఆరు సీట్ల కోసం ఎస్టీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని రీజినల్‌ కో ఆర్డినేటర్‌ టి సంపత్‌కుమార్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలని, మాక్లూర్‌ మండలానికి చెందిన విద్యార్థినులకు తొలి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. మినీ గురుకులంలో సీబీఎస్‌ఈ సిలబస్‌ విద్యాబోధన ఉంటుందని తెలిపారు.

‘జననిసురక్ష యోజన’లో అవకతవకలు



సుభాష్‌నగర్‌: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జనని సురక్ష యోజన పథకంలో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తెలిపారు. జనని సురక్ష యోజన పథకంలో ఐదేళ్లలో పెట్టిన ఖర్చుల వివరాలను సమాచారహక్కు చట్టం ద్వారా కోరగా, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు బుధవారం వినియోగదారుల మండలికి అందజేశారు. ఈ సందర్భంగా సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. జనని సురక్ష యోజన స్కీం ఖర్చుల్లో భారీగా వ్యత్యాసముందన్నారు. 2020–21లో రూ.12.30 లక్షలు తక్కువగా ఖర్చు జరగడంపై వినియోగదారుల మండలి జేఏఎస్‌కే, జేఎస్‌ఐ కేంద్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనుందన్నారు. ఆయనవెంట జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు వీఎస్‌ వర్మ, ప్రధానకార్యదర్శి సందు ప్రవీణ్‌కుమార్‌, నాయకులు మహాదేవుని శ్రీనివాస్‌, గైని రత్నాకర్‌ ఉన్నారు.

జల్సాల కోసం ‘స్నాచర్‌’ అవతారం

- పక్కా వ్యూహంతో నలుగురిని పట్టుకున్న పోలీసులు



చైన్‌ స్నాచింగ్‌ కేసులకు సంబంధించి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు (ఫైల్‌)

మోర్తాడ్‌(బాల్కొండ): ఖరీదైన దుస్తులు ధరించి బైక్‌లపై రయ్‌మని దూసుకెళ్లాలని, మద్యం సేవిస్తూ ఎంజాయ్‌ చేయాలని.. ఇలా జల్సాల కోసం నలుగురు యువకులు చైన్‌స్నాచర్ల అవతారం ఎత్తారు. కష్టపడకుండానే చేతిలోకి డబ్బులు రావాలనే ఆశతో ఒంటరిగా వెళ్తున్న మహిళలను టార్గెట్‌ చేసుకొని వారి మెడల్లో నుంచి బంగారు గొలుసులను ఎత్తుకెళ్తూ పోలీసులకు చాలెంజ్‌ విసిరారు. ఇలా చోరీలకు పాల్పడుతున్న వారిని ఎలాగైనా పట్టుకోవాలనే లక్ష్యంతో రంగంలోకి దిగిన పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించి నలుగురు యువకులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 15.7 తులాల బంగారు ఆభరణాలతోపాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని కటకటాల వెనక్కి పంపించారు. మోర్తాడ్‌ మండలం తిమ్మాపూర్‌లో గతనెల 20వ తేదీన పల్లెపు గంగు అనే మహిళ మెడికల్‌లో మందులు తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమెను మాటల్లోకి దింపి మెడలోని బంగారం చైన్‌ను లాక్కెళ్లారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు. నిజామాబాద్‌ సీపీ కల్మేశ్వర్‌, ఆర్మూర్‌ ఏసీపీ బస్వారెడ్డి పర్యవేక్షణలో భీమ్‌గల్‌ సీఐ శ్రీనివాస్‌, మోర్తాడ్‌ ఎస్సై అనిల్‌రెడ్డి చాకచక్యంగా వ్యవహరించి నలుగురు చైన్‌ స్నాచర్లను అరెస్టు చేశారు. పోలీసులు పట్టుబడిన వారిలో నిజామాబాద్‌ నగరంలోని మిర్చి కాంపౌండ్‌కు చెందిన వర్మజి చంటి సాయికుమార్‌, డిచ్‌పల్లికి చెందిన బోయర్‌ శేఖర్‌తోపాటు వారికి బంధువైన మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన పాతూరి తరుణ్‌, అతడి స్నేహితుడు అబ్దుల్‌ సాజిద్‌ ఉన్నారు. నలుగురు కలిసి మోర్తాడ్‌, బాల్కొండ, ఆర్మూర్‌ పోలీసుల స్టేషన్ల పరిధిలో మహిళల మెడలోంచి బంగారు గొలుసులు ఎత్తుకెళ్లినట్లు తేల్చారు.

తిమ్మాపూర్‌లో దొంగిలించి పారిపోతుండగా..

తిమ్మాపూర్‌లో మహిళ మెడలో నుంచి దుండగులు బంగారు గొలుసును లాక్కుని పరారవుతున్నట్లు తెలుసుకున్న పోలీసులు సాంకేతికత సహాయంతో వారిని వెంబడించారు. మోర్తాడ్‌ నుంచి రామన్నపేట్‌ వైపు వెళ్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా బాల్కొండ, ఆర్మూర్‌ పోలీస్‌ స్టేషన్ల పరిధిలో సైతం చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడింది తామేనని నేరాన్ని అంగీకరించారు. ఒక్క కేసులో దొరికిన చిన్న క్లూతో ఎస్సై అనిల్‌రెడ్డి తనకు ఉన్న అనుభవం, సిబ్బంది సహకారంతో మిగతా చైన్‌ స్నాచింగ్‌ కేసులను ఛేదించారు.

ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్‌: వానాకాలం సీజన్‌కుగాను రైతులకు విత్తనాలు, పురుగుమందులు, ఎరువులను సబ్సిడీపై అందించాలని, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి ప్రభాకర్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించి ఏవో ప్రశాంత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ ఆరు గ్యారెంటీలను ప్రకటించిందని, అందులో రూ.2లక్షల రుణమాఫీ ఒకటని, ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలైనా ఇంతవరకు దానికి అమలు చేయలేదని విమర్శించారు. వానాకాలం సీజన్‌లో పెట్టుబడుల కోసం రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుభరోసా కూడా పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడం సరికాదన్నారు. ముఖ్యంగా పాడి పరిశ్రమ దినదిన గండంగా మారిందని, కల్తీ పాలతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. గేదెలను 50శాతం సబ్సిడీపై ఇవ్వాలని, పంటల బీమా పథకాన్ని కొనసాగించాలని డిమాండ్‌ చేశారు. స్వామినాథన్‌ కమిషన్‌ సిఫార్సులు వెంటనే అమలు చేయాలన్నారు. మూడేళ్లుగా అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఇంతవరకూ పరిహారం చెల్లించలేదని, వెంటనే చెల్లించాలన్నారు. కల్తీ విత్తనాలు, ఎరువులపై అధికారులు దృష్టి సారించి కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దేవరాం, జిల్లా అధ్యక్షుడు సారా సురేశ్‌, జిల్లా ప్రధానకార్యదర్శి గుమ్ముల గంగాధర్‌, బాబన్న, నాగన్న, రాజన్న, గంగారాం, శంకరన్న, సాయిరెడ్డి, బాలయ్య, సాయిలు, శంకర్‌, కిశోర్‌, మల్కి లింబాద్రి, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

పచ్చలనడ్కుడలో 144 సెక్షన్‌ అమలు

వేల్పూర్‌: మండలంలోని పచ్చలనడ్కుడలో గురువారం నుంచి 144 సెక్షన్‌ అమలులో ఉంటుందని ఎస్సై వినయ్‌కుమార్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఎక్కడ కూడా నలుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండొద్దని సూచించారు. పెద్దవాగు ఇసుక విషయంలో పచ్చలనడ్కుడ, జాన్కంపేట్‌ గ్రామాల మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో వివాదాస్పద స్థలం నుంచి ఇసుక తీయొద్దని ఏప్రిల్‌ 8న ఆర్మూర్‌ సబ్‌డివిజనల్‌ మేజిస్ట్రేట్‌ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. బుధవారం పచ్చలనడ్కుడ వీడీసీ సభ్యులు, కొంతమంది గ్రామస్తులు చట్టవిరుద్ధంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం నుంచి ఇద్దరు సభ్యులు గురువారం ఉదయం పెద్దవాగులో ఇసుకను సేకరించేందుకు రావాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలను పరిరక్షించడానికి వేల్పూర్‌ తహసీల్దార్‌ డి సరిత 144 సెక్షన్‌ ఉత్తర్వును జారీచేసినట్లు ఎస్సై ప్రకటనలో తెలిపారు.

విద్యార్థికి బంగారు పతకం



కమ్మర్‌పల్లి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎండీ ఫైజాన్‌కు బంగారు పతకం లభించింది. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో వందేమాతరం ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫైజాన్‌ను ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ సన్మానించి బంగారు పతకంతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

మహిళ కాళ్లపై నుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ బస్టాండ్‌లో ఆర్టీసీ డ్రైవర్‌ బస్సును నిర్లక్ష్యంగా నడపడంతో సుజాత అనే మహిళ తీవ్ర గాయాల పాలైంది. నిర్మల్‌ జిల్లా కేంద్రానికి చెందిన సుజాత బుధవారం ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లిలో నివాసం ఉంటున్న తన కూతురు వద్దకు బస్సులో వచ్చింది. బస్సు దిగి బస్టాండ్‌ వెలుపలికి వెళ్తుండగా అప్పుడే రివర్స్‌ తీస్తున్న మరో బస్సు (నిర్మల్‌ డిపో) మహిళను ఢీకొంది. దీంతో మహిళ బస్సు వెనుక చక్రాల కింద పడటంతో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జ అ య్యాయి. ప్రయాణికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్‌ ఆస్పత్రికి తరలించారు.కాగా మహిళ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. బస్సును అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌ తెలిపారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

- బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- మృతులు భిక్కనూరు మండలం మల్లుపల్లి వాసులు..
- గల్ఫ్‌ ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్తుండగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘటన



ఘటనాస్థలంలో అబ్దుల్లా, చాంద్‌ మృతదేహాలు

భిక్కనూరు: తరాలుగా తమ కుటుంబీకులు చేస్తున్న వృత్తి తమకు అన్నం పెట్టడం లేదనే కారణంతో గల్ఫ్‌ దేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. భిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన ప్రాణస్నేహితులు (వరుసకు అన్నాదమ్ముళ్లు) షేక్‌ అబ్దుల్లా (36), సయ్యద్‌ చాంద్‌(40) ఒకే చోట పనిచేయడంతోపాటు ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్తుంటారు. తాతముత్తాతల నుంచి వస్తున్న రాళ్లు కొట్టే పని చేసిన అబ్దుల్లా, చాంద్‌ మూడేళ్ల క్రితం గల్ఫ్‌కు వెళ్లి వచ్చారు. స్వగ్రామానికి వచ్చిన ఇద్దరూ మళ్లీ రాళ్లుకొట్టే పని చేసినప్పటికీ మళ్లీ గల్ఫ్‌ వెళ్లేందుకు ఏజెంట్లను సంప్రదించారు. అయితే, రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం ఇంటర్వ్యూ ఉందని తెలుసుకొని అబ్దుల్లా, చాంద్‌తో పాటు మరో ఇద్దరు రెండు బైక్‌లపై బయల్దేరారు. ఈ క్రమంలో పెద్దమ్మ స్టేజీ వద్ద అబ్దుల్లా, చాంద్‌ వెళ్తున్న బైక్‌ను డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు ప్రాణస్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. అబ్దుల్లాకు భార్య, ఇద్దరు పిల్లలు, చాంద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



అబ్దుల్లా (ఫైల్‌) చాంద్‌ (ఫైల్‌)

బైక్‌ను గూడ్స్‌ వాహనం ఢీకొట్టిన ఘటనలో మరొకరు..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మహీంద్ర గూడ్స్‌ వాహనం బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో భిక్కనూర్‌ మండలం జంగంపల్లికి చెందిన పుల్లూరి రాజు(30) మృతి చెందగా, పుల్లూరి శంకర్‌ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తాడ్వాయిలో బుధవారం నిర్వహించిన అంత్యక్రియల్లో డప్పులు కొట్టేందుకు వచ్చిన రాజు, శంకర్‌ తిరిగి బైక్‌పై కామారెడ్డి వైపు వెళ్తుండగా కామారెడ్డి – ఎల్లారెడ్డి రహదారిపై పోచమ్మగుడి సమీపంలోని మూలమలుపు వద్ద గూడ్స్‌ వాహనం ఢీకొట్టింది. రాజు ఘటనాస్థలంలో మృతి చెందగా, గాయాలపాలైన శంకర్‌ను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీజీహెచ్‌ రేకుల షెడ్డులో గుర్తుతెలియని యువకుడు..

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ నగరంలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి రేకులషెడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు బుధవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, ఎడమ చేతిపై ‘నాని’ అని పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుడి సంబంధీకులు ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో లేదా 87126 59837, 08462–220150 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దుబాయిలో గుండెపోటుతో కొత్తపల్లి వాసి మృతి



భూమేశ్వర్‌(ఫైల్‌)

బాల్కొండ: బతుకు దెరువు కోసం దుబాయికి వెళ్లిన ముప్కాల్‌ మండలం కొత్తపల్లి వాసి కోట భూమేశ్వర్‌(49) అక్కడే గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం ఉదయం తన రూములో స్నేహితుడితో మాట్లాడుతుండగా ఛాతినొప్పి రావడంతో అక్కడున్న వారు సీపీఆర్‌ చేసి ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆస్పత్రిలో రెండోసారి గుండెపోటు రావడంతో మృతి భూమేశ్వర్‌ చెందాడు. గత 30ఏళ్లుగా దుబాయిలో పనిచేస్తున్న భూమేశ్వర్‌ సెలవుపై స్వగ్రామానికి వస్తూ వెళ్లేవాడు. గత నెల 5వ తేదీనే భూమేశ్వర్‌ దుబాయికి వెళ్లాడు.

విద్యుత్‌ షాక్‌తో రైతు..

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం గగ్గుపల్లి గ్రామశివారులోని వ్యవసాయ భూమిలో విద్యుత్‌షాక్‌తో రాంపూర్‌ పోశన్న(55) అనే రైతు మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై అశోక్‌ తెలిపారు.

అప్పులు తీర్చేమార్గం లేక ఆత్మహత్య

రామారెడ్డి: అప్పుల తీర్చే మార్గంలేక జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. రామారెడ్డికి చెందిన కుమ్మరి నారాయణ(52) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికితోడు చేసిన అప్పులు తీర్చే మార్గంలేకపోవడంతో జీవితంపై విరక్తితో మంగళవారం విషం సేవించగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలో నారాయణ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్‌ తెలిపారు.

కాపర్‌ కాయిల్స్‌ చోరీ

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): మండలంలోని వెల్లుట్లపేట శివారులో ఉన్న 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి మంగళవారం దండగులు కాపర్‌తోపాటు ఆయిల్‌ ఎత్తుకెళ్లినట్లు ఎస్సై మహేశ్‌ బుధవారం తెలిపారు. రైతు సాయాగౌడ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బస్సును ఢీకొట్టిన టిప్పర్‌

డిచ్‌పల్లి: కామారెడ్డి నుంచి నిజామాబాద్‌ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును మండలంలోని బర్దీపూర్‌ శివారులో ఎదురుగా వస్తున్న టిప్పర్‌ ఢీకొట్టింది. మాధవనగర్‌ బైపాస్‌ రోడ్డుపై ఒకవైపు తారు వేస్తుండడంతో మరో వైపు నుంచే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈక్రమంలో బుధవారం ఉదయం 11 గంటలకు కామారెడ్డి డిపో బస్సును టిప్పర్‌ ఢీకొట్టగా బస్సు డ్రైవర్‌కు గాలయ్యాయి. ప్రమాదం జరిగిన తరువాత టిప్పర్‌ డ్రైవర్‌ వాహనంతోపాటు పరారైనట్లు బస్సు కండక్టర్‌ తెలిపారు. ఈ విషయమై డిచ్‌పల్లి పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



చేపూర్‌లో విద్యార్థినికి యూనిఫామ్‌ అందజేస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌ అంకిత్‌

ఆర్మూర్‌టౌన్‌/పెర్కిట్‌/బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా అదనపు కలెక్టర్‌ అంకిత్‌ అన్నారు. ఆర్మూర్‌ పట్టణంలోని రాంమందిర్‌ పాఠశాలతోపాటు మండలంలోని చేపూర్‌, బాల్కొండలోని ఉన్నత పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య, నోట్‌ పుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేశారు. పాఠశాలల్లో సౌకర్యాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను పరిశీలించారు. ఆయనవెంట ఆర్మూర్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ వన్నెల్‌దేవి లావణ్య, వైస్‌ చైర్మన్‌ షేక్‌మున్ను, కమిషనర్‌ రాజు, ఆర్డీవో రాజాగౌడ్‌, ఎంఈవోలు రాజగంగారం, రాజేశ్వర్‌, బాల్కొండ తహసీల్దార్‌ శ్రీధర్‌, ఎంపీడీవోలు సాయిరాం, విజయభాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎం చలం, కౌన్సిలర్‌ రాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి పద్మావతి

నిజామాబాద్‌నాగారం: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవ సాధికారిత సంస్థ(డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శి, న్యాయమూర్తి పద్మావతి పిలుపునిచ్చారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నగరంలోని ధర్మపురి హిల్స్‌ డ్రైవర్స్‌ కాలనీలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి పద్మావతి మాట్లాడుతూ.. 14 సంవత్సరాల లోపు పిల్లలు కచ్చితంగా చదివే విధంగా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు చదువుకుంటేనే దేశ భవిష్యత్‌ ఉజ్వలంగా ఉంటుందని, కుటుంబాలు కూడా బాగుపడతాయన్నారు. పిల్లలు ఎక్కడైనా పనిలో ఉంటే చైల్డ్‌ హెల్ప్‌ లైన్‌ నంబర్‌ 1098కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ లేబర్‌ ఆఫీసర్‌ యోహాన, బాల రక్ష భవన్‌ కో ఆర్డినేటర్‌ విజయలక్ష్మి, డీసీపీవో చైతన్యకుమార్‌, నిజామాబాద్‌ అర్బన్‌ ఇన్‌చార్జి సీడీపీవో నందిని, చైల్డ్‌ లైన్‌ కో ఆర్డినేటర్‌ జ్యోత్స్న, ఐసీడీఎస్‌, డీసీపీయూ, చైల్డ్‌ హెల్ప్‌ లైన్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంఘం ఎన్నికలకు కసరత్తు

- నోటీసు బోర్డుపై ఓటర్ల జాబితా ప్రదర్శన
- అభ్యంతరాలకు మూడు రోజుల గడువు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్‌ ఎన్నికల నిర్వహణకు కసరత్తు జరుగుతోంది. ఈ జిల్లా స్థాయి ఎన్నికలు దాదాపు 350 మత్స్య పారిశ్రామిక సంఘాలతో ముడిపడి ఉండగా మొత్తం 356 మందితో కూడిన ఓటరు జాబితా సిద్ధమైంది. ఈ మేరకు జాబితాను జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో నోటీసు బోర్డుపై బుధవారం ప్రదర్శించారు. అయితే ఓటర్ల జాబితాలో తప్పొప్పులు, అభ్యంతరాలు తెలుపడానికి మూడు రోజులు గడువు విధించినట్లు మత్స్య శాఖ ఏడీ రాజనర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గడువులోగా ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే దానినే తుది ఓటర్ల జాబితాగా పరిగణిస్తారు. జిల్లా కలెక్టర్‌ అనుమతిలో ఓటరు జాబితాను రాష్ట్ర శాఖ ద్వారా రాష్ట్ర సహకార సంఘం ఎన్నికల కమిషన్‌కు పంపనున్నారు. అనంతరం ఎన్నికల కమిషన్‌ జిల్లా మత్స్య సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్‌ ఇవ్వనుంది. ఈ నెలాఖరు వరకు నోటిఫికేషన్‌ వచ్చే అవకాశాలున్నాయని ఆఫీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

పోటీకి సై అంటున్న ఆశావహులు...

గతంలో పని చేసిన పాలకవర్గం గడువు కొన్ని నెలల క్రితం ముగిసిపోవడంతో మత్స్య శాఖ అధికారులు కమిటీని రద్దు చేశారు. కొత్త సంఘాన్ని రిజిస్టర్‌ చేశారు. ఇప్పుడు నూతన జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి ఎన్నిక జరగాల్సి ఉంది. పాలకవర్గంలో చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌ కలిపి మొత్తం 11 మంది డైరెక్టర్లు ఉంటారు. ఎన్నికల నిర్వహణకు కసరత్తు తుది దశకు చేరడంతో ఆశావహులు పోటీకి సై అంటున్నారు. చైర్మన్‌ పదవికి ముగ్గురు పోటీలో ఉన్నారు. ఎన్నికల కమిషన్‌ నుంచి గ్రీన్‌ సిగ్నల్‌ రాగానే ఎన్నికలు నిర్వహిస్తారు.

వృద్ధురాలి దారుణహత్య

- బాన్సువాడలో గొంతు కోసి నగలు ఎత్తుకెళ్లిన దుండగులు



సాయమ్మ(ఫైల్‌)



మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

బాన్సువాడ: నగల కోసం దుండగులు వృద్ధురాలి గొంతుకోసి హత్యచేసిన ఘటన బుధవారం బాన్సువాడలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తాడ్కోల్‌ శివారులోని డబుల్‌ బెడ్‌ రూం కాలనీలో ఉప్పరి శంకర్‌ అనే వ్యక్తికి ప్రభుత్వం డబుల్‌ బెడ్‌రూం ఇల్లు కేటాయించగా, కొడుకు కుటుంబ సభ్యులతో కలిసి తల్లి సాయమ్మ(75) అందులోనే ఉంటోంది. కొన్ని రోజుల క్రితం శంకర్‌ తన భార్యాపిల్లలతో కలిసి కూలీ పని చేసేందుకు హైదరాబాద్‌కు వెళ్లాడు. మంగళవారం రాత్రి సాయమ్మ స్థానికులతో చాలాసేపు మాట్లాడి ఇంట్లోకి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం శంకర్‌ ఎన్ని సార్లు ఫోన్‌ చేసినా సాయమ్మ లిఫ్ట్‌ చేయకపోవడంతో అనుమానం వచ్చి అదే బ్లాక్‌లో ఉన్న తెలిసిన వారికి ఫోన్‌ చేశాడు. తన తల్లి ఫోన్‌ లిఫ్ట్‌ చేయడం లేదని వెళ్లి చూడాలని కోరగా, వారు వెళ్లి చూసే సరికి సాయమ్మ రక్తపు మడుగులో పడి ఉంది. సాయమ్మ చెవులకు, మెడలో ఉన్న బంగారు ఆభరణాల కోసం ఆమెను గొంతుకోసి హత్య చేశారని స్థానికులు పేర్కొంటున్నారు. డీఎస్పీ సత్యనారాయణ, సీఐ కృష్ణ ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతురాలి పెద్ద కుమారుడు గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిన్నారిని నేలకేసికొట్టి హత్య

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందని ఘాతుకం



మృతి చెందిన మహన్వి

చివ్వెంల(సూర్యాపేట): వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందని చిన్నారిని నేలకేసి కొట్టి హత్య చేసిన ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలాపురంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌ జిల్లా గుండారం గ్రామానికి చెందిన కటకట లక్ష్మణ్‌తో అదే జిల్లా సాటాపూర్‌ గ్రామానికి చెందిన రమ్య అలియాస్‌ నవ్యశ్రీ వివాహం ఆరేళ్లక్రితం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు అరుణ్య (4), మహన్వి(22 నెలలు). కాగా ఏడు నెలలుగా రమ్యశ్రీ అదే గ్రామానికి చెందిన బొల్లెం అరవింద రెడ్డితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. 20 రోజుల క్రితం ఇద్దరు పిల్లలను తీసుకుని ప్రియుడితో కలిసి సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలాపురం గ్రామానికి వచ్చి అక్కడే నివాసం ఉంటున్నారు. అరవిందరెడ్డి ఇటుక బట్టీల వద్ద ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నారి మహన్వి తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని భావించి మంగళవారం రాత్రి అరవిందరెడ్డి ఆమెను కొరికి, కొట్టి హింసించి నేలకేసి కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రమ్య అత్త గంగమణి ఫిర్యాదు మేరకు సూర్యాపేట రూరల్‌ సీఐ సురేందర్‌రెడ్డి ఆదేశాలతో ఎస్‌ఐ బి వెంకట్‌ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆవును చంపిన ఇద్దరికి 50 రోజుల కారాగార శిక్ష

రుద్రూర్‌: మండల కేంద్రంలోని జవహర్‌నగర్‌ కాలనీ సమీపంలో ఏడేళ్ల క్రితం ఆవును చంపిన ఇద్దరు వ్యక్తులకు బోధన్‌ కోర్టు 50 రోజుల కఠిన కారాగార శిక్షతోపాలు ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించినట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. జవహర్‌నగర్‌ కాలనీ సమీపంలో 2017 మార్చి 17న అర్ధరాత్రి గైని కృష్ణ, ఎండీ హైమద్‌ ఖురేషీ ఆవును చంపి పెట్రోలింగ్‌ పోలీసులను చూసి పరారయ్యారు. పోలీసులు కేసు నమోదుచేసి నిందితులను కోర్టులో హాజర్చగా నేరం రుజువైంది. దోషులకు 50 రోజుల కఠిన కారాగార శిక్ష విధిస్తూ బోధన్‌ కోర్టు అడిషనల్‌ జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్‌ సాయిశివ తీర్పు వెలువరించారు.

పశువుల సంత నిలిపివేత

ఇందల్వాయి: బక్రీద్‌ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు బుధవారం మండల కేంద్రంలో కొనసాగాల్సిన సంతను నిలిపివేశారు. సీఐ మల్లేశ్‌, ఎస్సై మనోజ్‌ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. సంతకు పశువులను తీసుకొచ్చిన వాహనాలను వెనక్కి పంపించారు.

కువైట్‌లో అగ్ని ప్రమాదం.. తెలంగాణలో కలకలం

మోర్తాడ్‌(బాల్కొండ): కువైట్‌లోని ఒక కార్మికుల క్యాంపులో బుధవారం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో అనేక మంది భారతీయ వలస కార్మికులు మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయి. ఎంబీటీ లేబర్‌ క్యాంపులో సిలిండర్‌లు పేలడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక ఆపార్టమెంట్‌లో కార్మికుల వసతి కోసం క్యాంపును నిర్వహిస్తున్నారు. ఉదయం వంట చేసే క్రమంలో సిలిండర్‌ పేలడం దానిదాటికి అదే భవనంలో ఉన్న ఇతర సిలిండర్‌లు పేలడంతో ప్రమాదం తీవ్ర స్థాయిని సంతరించుకుంది. ఇప్పటికే 45 మంది భారతీయ వలస కార్మికులు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఇందులో కేరళ, తమిళనాడులకు చెందిన వారు ఎక్కువగా ఉన్నారని సమాచారం. కొందరు కార్మికులు సిలిండర్‌ పేలి సంభవించిన అగ్ని ప్రమాదంలో మరణించగా మరి కొందరు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి భవనంపై నుంచి దూకి ప్రమాదవశాత్తు మరణించినవారు ఉన్నారు. తెలంగాణ వలస కార్మికులు ఈ క్యాంపులో లేకపోయినా ఎవరైనా ఉండి ఉంటారేమో అనే సందేహంతో అనేక మంది వలస కార్మికుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. భారతీయ వలస కార్మికులకు జరిగిన ప్రమాదంపై వివరాలను తెలుసుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు విదేశాంగ శాఖ కార్యాలయంకు ఫోన్‌లు చేస్తున్నా సమాచారం అందడం లేదు. నేడు మృతుల వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.